శ్రీ గంధం చెట్లు నరికివేత

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని కమ్మవారి పల్లి వద్ద కొండకమర్లకు చెందిన డి ఫయాజ్ తోటలో గుర్తు తెలియని వ్యక్తులు శ్రీ గంధం చెట్లు నరికి వేశారు. ఈసందర్భంగా బాధితుడు ఫయాజ్ మాట్లాడుతూ తన తోటలో 7 శ్రీ గంధం చెట్లు పెంచామన్నారు. వాటిలో రెండు పెద్దచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేసి ఎత్తుకెళ్లారన్నారు. ఈ విషయాన్ని తాను సోమవారం తోటకి వెళ్లి చూశానన్నారు. జరిగిన విషయాన్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

తొలగించిన శ్రీగంధ చెట్టు ప్రాంతం

కర్నాటకకు అక్రమంగా టిప్పర్లలో తరలుతున్న కంకర

అక్రమంగా కర్నాటకకు కంకర తరలింపు

మామూళ్ల మత్తులో రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు
ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అనుమతులు లేకుండా కర్ణాటక రాష్ట్రానికి కంకర తరలుతోంది. బొమ్మనహాల్ మండలంలోని నేమకల్ గ్రామంలోని కంకర మిషన్ల నుండి రోజూ వచ్చే కంకర బోట్, రాజి పౌడర్‌ను యాజమాన్యం కర్ణాటకకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైన్స్, జియాలజీ శాఖల నుండి అనుమతిపొందిన వారే టన్నుల ప్రకారం కంకర బోట్, రాజి పౌడర్ కర్ణాటకలో అమ్మాల్సి ఉంటుంది. కాసులకు కక్కుర్తిపడి అక్రమంగా కంకర కర్ణాటకకు తరలుతున్నా మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ప్రయివేటు కంకర మిషన్ల యాజమన్యాంతో కుమ్మక్కై తూతూ మంత్రంగా ట్రిప్ సీట్లు మంజూరుచేసి జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి బారీగా గండిపడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కంకర మిషన్ యజమానులు సైతం బళ్లారిలో నివాసం ఉంటున్నందున వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. అధికారులు కంకర తోలేందుకు స్థానికంగా ఉన్న టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులకు అనుమతులు ఇవ్వకుండా కర్నాటకలోని బళ్లారిలో ఉండే వ్యాపారులకు టిప్ సీట్లు అందజేస్తున్నట్లు సమాచారం.

స్థానికులకు అందుబాటులో ఉండని కంకర..

బొమ్మనహాల్ మండలంలో కంకర ఫ్యాక్టరీలు బోలెడు ఉన్నా స్థానికంగా భవన నిర్మాణాలకు కంకర అందుబాటులో ఉండడంలేదు. ప్రతిరోజు సుమారు 20 టిప్పర్ల పైబడి కంకర కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్నట్లు నెమకల్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆంధ్రాలో కంకర మిషన్లు ఉన్నా లాభాలు మాత్రం కర్ణాటక వారికే దక్కుతున్నాయని వాపోతున్నారు. పునాదులకు అవసరమైన బోట్ రాస్ తమకు దొరకడం లేదు.. కర్ణాటకలోని వారికి మాత్రం కేవలం గంట సమయంలోనే అందిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు..

రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అనుమతులు లేని కార్ణాటక టిప్పర్లు ఆంధ్రాలో ప్రవేశించి కంకర లోడు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. క్వారీల్లో 20 అడుగుల లోతు మాత్రమే బ్లాస్టింగ్ చేయాలి. సుమారు 50 అడుగులకు పైబడి బ్లాస్టింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు అక్రమ కంకర రవాణాను అరికట్టి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

టిడ్కో అలా..జగనన్న కాలనీలో ఇలా..!

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా..ఏ పార్టీ అయినా చెప్పేది ఒక్కటే మాట...పేదల సొంతింటి కలను నెరవేరుస్తామంటూ హామీ ఇవ్వడం. ఎన్నికలు ముగిశాక..ఇచ్చిన సొంతింటి హామీని మాత్రం నెరవేర్చరు. మళ్లీ ఎన్నికలు వస్తాయి..మళ్లీ అదేహామీ. ఆ పార్టీ..ఈ పార్టీ అని కాదు.. ఏపార్టీ అయినా ఇదే తంతు. హిందూపురం పట్టణంలో గత 15 సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు. ఉండడానికి సొంతిల్లు లేక పేదలు రూ.వేలు అద్దె చెల్లించి నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వం కొటపి వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో టిడ్కో గృహాల నిర్మాణ పనులను ప్రారంభించింది. ఇదే సమయంలో కర్నాటక రాష్ట్రం తుంకూరులో పనులు ప్రారంభించి.. గృహ ప్రవేశాలు జరిగి.. నివాసాలు ఉంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇంకా పనులే పూర్తికాలేదు. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకపోవడమే ఇందుకు కారణం. వెరసి పేదల సొంతింటి కల..కలగానే మిగులుతోంది.

దిష్టి బొమ్మల్లా టిడ్కో గృహాలు
పునాదులు దాటని జగనన్న కాలనీలు
పేదల సొంతింటి కల నెరవేరేనా ?

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తామని ఐదేళ్ల క్రితం హిందూపురం పట్టణం కొటపి సమీపంలో టిడ్కో అపార్టమెంట్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అవి ఇంత వరకు పూర్తి చేయలేదు. అనంతరం వచ్చిన జగనన్న ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యమని జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. మూడు ఆప్షన్లుగా ప్రభుత్వం ఇంటి నిర్మాణాల పనులకు శ్రీకారం చుట్టింది. మొదటి, రెండవ ఆప్షన్లలో లబ్దిదారులే నిర్మాణం చేసుకోవాలని, మూడవ ఆప్షన్‌లో ప్రభుత్వమే నిర్మాణం చేసి ఇస్తుందని లబ్దిదారులకు చెప్పారు. హిందూపురం పురపాలక సంఘంలో రెండు ప్రాంతాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. కొట్నూరు వద్ద ఏర్పాటు చేసిన కాలనీలో కాస్త పనులు జరుగుతున్నాయి. కొటిపి వద్ద ఏర్పాటు చేసిన కాలనీలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రభుత్వం రెండు సార్లు మెగా గ్రౌండింగ్ మేళా చేపట్టింది. కొంతమంది లబ్ధిదారులు సొంత ఖర్చులతో పునాదులు తీయించే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు

కొటిపి వద్ద నిర్మాణ దశలో ఆగిపోయినా టిడ్కో ఇళ్లు

లేఅవుట్లలో సిమెంటు రహదారులు, తాగునీటి సరఫరా పైపులైన్లు, విద్యుత్తు సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించలేదు. అధికారులు గుత్తేదారులు అడిగిన సిమెంటు, స్టీల్, ఇసుకను సమకూర్చకపోవడంతో గుత్తేదారులు పూర్తి స్థాయిలో పనులు చేయడం లేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. మెగా గ్రౌండింగ్ మేళా సమయంలో కొంత మంది తామే సొంతంగా ఇల్లు నిర్మించుకుంటామని ముందుకొచ్చారు. అయితే పెరిగిన ధరలకు భయపడి వారు సైతం పునాదులు వేసి వదిలేశారు. మరికొంత మంది మావల్ల కాదు..ప్రస్తుతం పెరిగిన ధరలతో ఇళ్ల నిర్మాణం చేయలేమని చేతులెత్తేశారు. ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని అంటున్నారు.

జగనన్న కాలనీలో పునాదులకే పరిమితమైన ఇళ్లు

తొలివిడత 1.20 లక్షల మందికి ఇళ్ల పట్టాలు

జిల్లాలో తొలి విడత కింద దాదాపు 1.20 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్లు, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇంటి స్థలం కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు ఐచ్ఛికాలు ఇచ్చి..అందులో ఒకటి ఎంచుకోవాలని చెప్పింది. జిల్లాలో అత్యధిక శాతం మంది ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. హిందూపురం పురపాలక సంఘంలో అయితే మొత్తం 5712 మందిని తొలి విడత ఎంపిక చేశారు. ఇందులో 784 మంది మొదటి, రెండవ ఆప్షన్ల కింద ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. మిగిలిన 4928 మంది లబ్ధిదారులు ప్రభుత్వమే ఇంటిని నిర్మాణం చేసి ఇవ్వాలని కోరారు. దీంతో ప్రభుత్వం బెంగళూరుకు చెందిన న్యూస్ ఎజెన్సీకి పనులను అప్పగించింది. అయినప్పటికీ పనులు మాత్రం వేగవంతంగా జరగడం లేదు. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశాలు ఇస్తునప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. సంవత్సర కాలంగా వేగ వంతంగా పనులు చేస్తున్నప్పటికీ పనులు మాత్రం పునాదులకే పరిమితం అయ్యాయి.

పెరిగిన ధరలతో ఇదీ పరిస్థితి..

పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఒక్క యూనిట్‌కు రూ.1.8 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ.1.5 లక్షలు కేంద్రం ఇస్తోంది. రూ.30 వేలు నరేగా కింద సర్దుబాటు చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు కేంద్రం ఇస్తోంది. రూ .30 వేలు రాష్ట్రం భరించాల్సి ఉంది. హిందూపురంలో దాదాపు 5600 గృహాలను మంజూరు చేశారు. ఏడాదిలో నిర్మాణాలు పూర్తి చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. పెరిగిన సిమెంటు, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోవడం లేదు. దీనికి ధరల మంట తోడయ్యింది. ఒక గృహం 342 చదరపు అడుగుల విస్తీర్ణంలో పునాదులు, గోడలు స్లాబ్ మాత్రమే నిర్మాణం చేయాల్సి ఉంది. లబ్దిదారులు నిర్మాణం చేసుకుంటే పునాది పూర్తి చేస్తే రూ.60 వేలు, పైకప్పు వరకు స్లాబ్ బిల్లులు నిర్మాణం చేస్తే రూ.60 వేలు, పై కప్పు వేస్తే రూ.30 వేలు చొప్పున చెల్లిస్తారు. అయితే ప్రభుత్వం చెల్లించే నిధులు సరిపోక పోవడంతో నిర్మాణాలు ఏక్కడికక్కడ ఆగిపోయాయి.

ప్రభుత్వం ప్రత్యేక చోరవ తీసుకుని ఇచ్చే నిధులను పెంచి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలూ కల్పించి, బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తే నిర్మాణాలు వేగవంతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

సిఐటియు మహాసభలను విజయవంతం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సిఐటియు 17వ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేశులు పిలుపునిచ్చారు. సోమవారం సిఐటియు స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభలకు సంబందించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు బెంగళూరులో సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యాచరణపై తీర్మానాలు చేయడం జరుగుతుందని అన్నారు. 5వ రోజు బెంగళూరు నగరంలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకున్నారన్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నాడని విమర్శించారు. రైల్వే లాంటి బలమైన ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేయాలని చూస్తున్నారన్నారు. తద్వారా కార్మికులను కష్టాల్లో నెట్టాలని చూస్తున్నాడని విమర్శించారు. అందుకే దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించడానికి కార్మికుల పక్షాన పోరాటాలు చేయడానికి ఈ మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. ఈ మహాసభల్లో కార్మిక వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, కోశాధికారి సాంబశివ,నాయకులు లక్ష్మీనారాయణ, బాబావలి, రామకృష్ణ, గౌస్‌లాజం, పైపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి, మసీదు అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

'బత్తల'ను కలిసిన ముస్లిం సోదరులు

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ తన దాతృత్వం మరోసారి చాటుకున్నారు. ఈ మేరకు కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి ఎస్సీ కాలనీలోని చర్చి వద్ద కమిటీ హాలు నిర్మాణానికి రూ. 4లక్షలు విరాళం ప్రకటించారు. దీంతో కాలనీవాసులు బత్తల హరిప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు

ఇస్తామా కోసం స్థలం కేటాయింపు : కుమ్మర వాండ్లపల్లిలోని బత్తల హరిప్రసాద్ నివాసంలో ఇస్తామా జమాత్ ముస్లిం మత పెద్దలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కుమ్మరవాండ్లపల్లిలో మార్చి నెలలో నిర్వహించు ఇస్తమా కొరకు 13 ఎకరాల భూమి కావాలని కోరగా అందుకు డాక్టర్ బత్తల హరిప్రసాద్ అంగీకరించారు. అలాగే ఇస్తమా కోసం తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని జమాత్ పెద్దలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి కదిరి పట్టణ అధ్యక్షులు, కె ఎస్ బహావుద్దీన్, మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ, బత్తల ఏసు, 14 వ వార్డు కౌన్సిలర్, పట్నం షామీర్, ముబారక్, బాబ్జాన్, మహబూబ్, జహాన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని రాయచోటి రోడ్ లో గల మక్కా మసీదు ముత్తు వల్లి నల్లమడ నిజాం ఆహ్వానం మేరకు డాక్టర్ బత్తల హరిప్రసాద్ మక్కా మసీదును సోమవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. మసీదు అభివృద్ధికి తన వంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో ఉన్నా వైసిపి ప్రభుత్వానికి ప్రజాసమస్యలు ఏ మాత్రం పట్టలేదనిటిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ విమర్శించారు. సోమవారం రూరల్ మండలం కిరికెర పంచాయితీలోని వినాయకనగర్‌లో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసకున్నారు. అనంతరం అంబికా మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు హెచ్‌ఎన్ రాము, టిడిపి నాయకులు ఆంజనేయులు, ప్రకాష్, వీవర్స్ కాలనీ ఆంజనేయులు, యూనిట్ ఇన్‌ఛార్జి మల్లికార్జున, మదన్ గోపాల్ రెడ్డి, రామకృష్ణ, మూర్తి, జగప్ప, నరసింహప్ప, వెంకట్రామప్ప, సుధాకర్ రెడ్డి, బుడెన్‌సాబ్, రాజప్ప, తెలుగు యువత నాయకులు నూరు, మొహమ్మద్, నాగేంద్రబాబు, జయరాం, అశ్వర్థ నారాయణ, శివ, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న టిడిపి నాయకులు

వడ్డీల పేరుతో రూ.3 కోట్లకు కుచ్చుటోపీ

పరారీలో ఫిజియోథెరపిస్టు కామిశెట్టి రఘువీర ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

వడ్డీల పేరుతో మచ్చిక చేసుకుని నమ్మించిన ఓ ఘనుడు రూ.3 కోట్లు కుచ్చుటోపి పెట్టి పరారీ అయ్యాడు. వివరాల్లోకి వెళ్తే..అనంతపురం నగరంలోని శ్రీనివాసనగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా రఘువీర ప్రసాద్ అనే వ్యక్తి ఫిజియోథెరపీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. దీనికి తోడు ఆయన రియలెస్టేట్, షేర్ మార్కెట్ వ్యాపారం చేసేవాడు. ఇందుకు గాను వడ్డీలకు రూ.3 కోట్ల వరకు అప్పుచేశాడు. రఘువీర ప్రసాద్ తల్లి విశ్రాంత ఉపాధ్యాయురాలు కావడం, అక్కలు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో అతన్ని నమ్మి బాధితులు డబ్బు అప్పుగా ఇచ్చారు. వ్యాపారంలో నష్టపోవడంతో రఘువీర ప్రసాద్ అప్పు ఇచ్చిన వారందరికీ ఐపి నోటీసులు పంపారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ధర్మ వడ్డీకి డబ్బు అప్పు ఇస్తే ఐపి నోటీసులు పంపి తమను మానసిక వేధనకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఇలాంటివారిని న్యాయస్థానం కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం రఘువీర ప్రసాద్ తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పరారీలో ఉన్నట్లు సమాచారం.

ఊరించి ఉసూరుమనిపించిన పదవులు

ముగిసిన కార్పొరేషన్ డైరెక్టర్ల పదవీకాలం
పదవీకాలం పొడగింపుపై ఆశలు

ప్రజాశక్తి మడకశిర

వెనుకబడిన కులాల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవీకాలం డిసెంబరు 17తో ముగిసింది. ఉమ్మడి జిల్లాలో అత్యధిక కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు కలిగి ఉన్న నియోజకవర్గం మడకశిర. ఎందుకంటే రాష్ట్రంలోని అత్యధిక వక్కలిగ సామాజిక వర్గం కలిగి ఉన్న నియోజకవర్గ మడకశిర. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవి మాజీ మంత్రి హెచ్‌బి నర్సే గౌడు కుమార్తె డాక్టర్ నళినిరంగేగౌడ్‌ను వరించింది. అదేవిధంగా 12 మంది డైరెక్టర్ల లో 10 మంది డైరెక్టర్లను సైతం ఈ నియోజకవర్గానికి చెందిన వారే ఉండడం విశేషం. వక్కలిగల నుండి రాజేశ్వరి, నేత్రావతి, గగన, అన్నపూర్ణ, నాగలక్ష్మమ్మ, అనిత, వీర క్యాతరాయప్ప, డాక్టర్ దేవరాజు, నాగరాజ్ గౌడ్ , నాగన్న డైరెక్టర్లుగా ఉండేవారు. కురుబ సామాజికవర్గానికి బిదురమ్మ, వాల్మీకి సామాజికవర్గానికి రామకృష్ణ, యాదవ సామాజిక వర్గం నుండి రాధమ్మ డైరెక్టర్లుగా ఉంటూ వచ్చారు. రాష్ట్రంలో ఉన్న 56 కులాల కార్పొరేషన్లకు సంబంధించి 2020 డిసెంబర్ 17వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి రెండు సంవత్సరాల పదవీకాలం శనివారం తో ముగిసింది. దీంతో ఈ ప్రాంతంలో కులాల కార్పొరేషన్ కు చెందిన 13 మంది కార్పొరేషన్ డైరెక్టర్లు ఒక చైర్మన్ పదవీకాలం ముగిసినట్లైంది. కాగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని సంగీతం నృత్య అకాడమీ డైరెక్టర్ శాలిని సుధాకర్, మరో క్రిస్టియన్ డైరెక్టర్ పదవి కాలం మాత్రం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా తమ పదవీకాలం ముగిసిన డైరక్టర్లు, చైర్మన్ తమ పదవీకాల వ్యవధిలో ఆయా కులాల అభివృద్ధికి తీసుకున్న చర్యలు శూన్యం అని చెప్పాలి. కేవలం కార్పొరేషన్లు ఏర్పాటు చేశారే తప్ప అందుకు వివిధ అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించలేదు. దీంతో పదవి పొందిన వారు ఉత్సవ విగ్రహాలుగా, అలంకారప్రాయంగా మిగిలిపోయారు. కార్పొరేషన్‌కు నిధులు మంజూరు అవుతాయని తమ పదవీకాలంలో చెప్పుకుంటూ వచ్చిన వారు తమ సామాజిక వర్గాలకు చేయూత అందించలేకపోయామని నిరాశ చెందుతున్నారు. ఎన్నికల చివరి సంవత్సరం కావడంతో తమ పదవీకాలం ఏడాదిపాటు పొడిగించి నిధులు కేటాయిస్తారేమోనన్న భావన వారిలో నెలకొంది. ఎందుకంటే ఈ డైరెక్టర్ల పదవీకాలం చేపట్టే నాటికి కరోనా నేపథ్యంలో ప్రభుత్వం విపత్కర పరిస్థితుల ఎదుర్కొంటోంది. ప్రజారోగ్యంపై దృష్టి సారించి ఆ దిశగా నిధులు విడుదల చేసింది. దీంతో కార్పొరేషన్లకు నిధులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది . ప్రభుత్వ పరిస్థితిని గ్రహించిన డైరెక్టర్లు సైతం సంయమనం పాటించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులను గుర్తించి ఒత్తిడిని తీసుకోరాకుండా ఆయా కులాల నుంచి వస్తున్న ఒత్తిడి లను సైతం దిగమింగుతూ వచ్చారు. ఇప్పటివరకు ఆయా కులాలకు ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించలేకపోవడంతో ఎన్నికల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్న భావనతో ప్రభుత్వం వీరి కాల వ్యవధిని పెంచాలని అందులోనూ ఎన్నికల చివరి సంవత్సరం కావడంతో నిధులు కేటాయించాలని ఆశిస్తున్నారు. మరో పక్క ప్రభుత్వం సైతం అధికారికంగా తమ పదవి కాలం ముగిసినట్లు ప్రకటించకపోవడం చూస్తే తమ పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలక పక్షంలో

ఉన్న కొద్ది మంది దళారులు డైరెక్టర్ల పదవి ఆశిస్తున్నవారికి ఎరవేసి లక్షలాది రూపాయలు దండుకోవడానికి తెర లేపారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

వడ్డే ఓబన్న ఆశయ సాధనకు కృషి

రొద్దం : వడ్డే ఓబన్న ఆశయాల సాధనకు కృషి చేద్దామని నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ సమీపంలో చావిడి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు వెంకట్ హాజరయ్యారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంతో హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. తొలితరం స్వాతంత్ర సమరయోధులు, రేనాటి వీరులు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, పాఠ్య పుస్తకాలలో వడ్డే ఓబన్న జీవిత చరిత్రను పొందుపరచాలని డిమాండ్ చేశారు. వడ్డెర్లు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వడ్డెర సంఘం నాయకులు సానిపల్లి శ్రీనివాసులు, సిపారం శ్రీనివాసులు, తాడంగిపల్లి రాజు, గంగాధర్, క్రిష్టప్ప, శ్రీరాములు, అక్కులప్ప, రమేష్, సురేష్, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు

ధర్మవరం టౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఆలయంలో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాళ్లపద్మావతి, పొరాళ్ల పుల్లయ్య ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం మహిళలు గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుమునుపు చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గమ్మ ఆలయానికి వెండి త్రిశూలం వితరణ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని దుర్గమ్మతల్లి దేవాలయానికి పట్టణానికి చెందిన దాసరి వెంకటేశులు కుమారుడు కార్తీక్ దంపతులు వెండి త్రిశూలం వితరణ చేశారు. రూ. 86 వేల విలువజేసే 100 గ్రాములు బరువుగల వెండి త్రిశూలాన్ని ఆలయ చైర్మన్ పర్తతయ్యకు, ఈవో వెంకటేశులకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మల్లికార్జున, హరి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

బత్తలపల్లి: బత్తలపల్లిలోని శ్రీలలిత త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో కొనసాగుతోంది. సోమవారం ఓంకారేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల సహకారంతో వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అన్నదాన కార్యక్రమం 41 రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. శివదీక్షా స్వాములు అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం పూర్తి చేసేందుకు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, యోగానందాచారి, విల్లె సూరి, కోటి అంజిత్ పాటు పలువురు పాల్గొన్నారు.

18న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు

తనకల్లు : మండల కేంద్రంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా 18న ఉదయం 10 గంటలకు మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ నుండి మండలకేంద్రానికి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కదిరి తేరుబజార్లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించబోయే రక్తదాన శిబిరానికి వెళతామన్నారు.

కాటికాపర్ల కమిటీ ఏర్పాటు

హిందూపురం : కులవివక్ష పోరాట సంఘానికి అనుబంధంగా మండల కాటి కాపర్ల కమిటిని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరా పార్కులో సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా గోపాలప్ప, కార్యదర్శిగా రామాంజనేయులు, సహాయ కార్యదర్శిగా నంజప్ప, కోశాధికారిగా జ్యోతమ్మ, ఉపాధ్యక్షులుగా వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ హిందూపూర్ మండల కార్యదర్శి మధు, నాయకులు నారాయణప్ప, మోదుగుపల్లి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కలశం అందజేత

హిందూపురం : పట్టణంలోని త్యాగరాజ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం చేస్తున్న రాతిఆలయానికి సోమవారం అంబికా లక్ష్మినారాయణ తన స్వగృహంలో అంబికా దంపతులు ఆలయం కోసం కలశం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు అశ్వర్థ నారాయణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు గోవిందరెడ్డి, ప్రదీప్, గంగాధర్, అశోక్, రఘురామప్ప, సాయిచరణ్, తదితరులు పాల్గొన్నారు.

సడ్లపల్లిలో ముగ్గుల పోటీలు

హిందూపురం : పురపాలక సంఘ పరిధిలోని13వ వార్డు సడ్లపల్లిలో వార్డు కౌన్సిలర్ సునీత వెంకటేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. సడ్లపల్లి సాయిబాబా గుడి వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు వార్డు కౌన్సిలర్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి, శబరీష్ రెడ్డి, శ్రీనాథ్, అచ్యుత రెడ్డి, ప్రణయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వైసీపీలో పలువురు చేరిక

సోమందేపల్లి : మండల పరిధిలోని ఈదుల బాలాపురం గ్రామానికి చెందిన సుమారు 40 కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఎమ్మెల్యే శంకర్నారాయణ ఆధ్వర్యంలో సోమవారం వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల పరిధిలోని చాలకూరు గ్రామంలో సర్పంచి లలితమ్మ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే శంకర్నారాయణ పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ నందిని పరంధామ, సర్పంచులు రామాంజనేయులు, కిష్టప్ప, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, ఆదినారాయణ రెడ్డి, నరసింహులు, ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, ఇఒఆర్‌డి నాగరాజు రావ్, ఎఇఒ అశోక్, సచివాలయ సిబ్బంది వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే శంకర నారాయణ

ఏకగ్రీవంగా పుట్టపర్తి బార్ అసోసియేషన్ ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి బార్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం న్యాయవాదులు సమావేశమై అసోసియేషన్ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కత్తి గంగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా నిలిమామి శ్రీనివాసులు, కార్యదర్శిగా అత్తవుర్ రహిమాన్, కోశాధికారిగా ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా లెక్కల యదుభూషణ్, రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ఇందిరా, వెంకటరమణప్ప, నాగేంద్ర ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగమల్లేశ్వర్ రెడ్డి, రాజగోపాల్, చంద్రశేఖర్, మౌనిక, నాగార్జున, మహేష్, భారతి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి పలువురు చేరిక

ధర్మవరం టౌన్ : తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన పలు కుటుంబాలు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ మేరకు జనసేనపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి సమక్షంలో చిల్లకొండయ్యపల్లికి చెందిన 20 కుటుంబాలకు చెందిన ఆరవేటిదామోదర్, తిమ్మంపల్లికార్తీక్, దాసగానిపపల్లి శంకరప్ప, శివకుమార్, పుల్లన్నలతో పాటు మరికొందరు పార్టీలో చేరారు. వీరందరికి చిలకం పార్టీకండువాలు వేసి ఆహ్వానించారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లిలోనిమ వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకెళ్తూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తున్న ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బాహుద్దీన్, వైస్ ఎంపీపీ భర్త ఆదినారాయణ, మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, ముబారక్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో బాలుడు మృతి

గాలిపటం ఎగురవేస్తూ మేడపైనుంచి కిందికి పడ్డ విద్యార్థి

మడకశిర : గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందికి పడి బాలుడు మృతిచెందిన సంఘటన పట్టణంలోని శంకరప్ప బావి కాలనీలో చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాలు... పట్టణం శంకర్ నగర్‌లో నివాసం ఉన్న ఆకుల సిద్దేశ్ కుమారుడు ఫణీంద్ర(12) సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటం ఎగురవేయడానికి తమ ఇంటి ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న భవనం పైకి వెళ్లాడు. గాలిపటం ఎగుర వేస్తున్న సమయంలో కాలుజారి భవనం పైనుంచి కిందపడ్డాడు. ఆసమయంలో బాలుడు కేకలు విన్న ఇంటిలో ఉన్న తల్లి దండ్రులు బయటకు వచ్చారు. తలకు బలమైన గాయంతో పడి ఉన్న కుమారుడుని చూసి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. బెంగళూరులో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం రాత్రి బాలుడుమతి చెందాడు. ఫణీంద్ర ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువు తున్నాడు. బాలుడి తల్లిదండ్రులు మడకశిర పట్టణంలో పూల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుమారుడి మృతితో అతని తల్లిదండ్రులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

ఫణీంద్ర (ఫైల్ ఫొటో)

రైలు ఢీకొని 53 గొర్రెలు మృతి

రూ.8లక్షల వరకు నష్టం

బత్తలపల్లి : మండలంలోని డి. చెర్లోపల్లి వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీ కొనడంతో 53 గొర్రెలు మృతిచెందాయి. దీంతో గొర్రెల కాపరికి రూ.8లక్షలు దాకా నష్టం వాటిల్లింది. మండలంలోని డి. చెర్లోపల్లికి చెందిన సుధా ప్రసాద్. చెడిపోతుల నారాయణప్ప ప్రవేటు వ్యక్తుల వద్ద రూ.8లక్షలు దాకా అప్పు చేసి 60 గొర్రెలను కొనుగోలు చేశారు. యధాప్రకారం ఆదివారం గొర్రెలను మేపులకు తీసుకువెళ్లారు. రైల్వే పట్టాల సమీపంలోని ఓ పొలంలో ఉన్న గొర్రెలు ఉన్నఫలంగా రైలు శబ్దానికి బెదిరిపోయి రైల్వే పట్టాలపైకి ఎక్కాయి. ధర్మవరం నుంచి తిరుపతి వెళుతున్న రైలు వీటిమీద దూసుకుపోవడంతో 53 గొర్రెలు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ముసలయ్య, నారాయణస్వామి తదితరులు బాధిత రైతులను పరామర్శించారు.

పేకాట జూదరులు అరెస్టు

బుక్కపట్నం : మండల పరిధిలోని క్రిష్ణాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా ఐదుగురికి అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 6,900 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మద్దెలచెరువులో పటిష్ట బందోబస్తు

కనగాన పల్లి : మండల పరిధిలోని మద్దెల చెరువు గ్రామంలో మంగళవారం నిర్వహించే ఊరు దేవర సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగిరి సిఐ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, 60 మంది పోలీసులతో భద్రత చేపట్టినట్లు కనగానపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. ఊరి దేవరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందితో పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఉద్యోగస్తులు క్రీడల్లో పాల్గొంటే ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత లభిస్తుందని మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు వడ్డెబాలాజీ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ సీతారామయ్య, చేనేత వ్యాపారులు నిమ్మ చంద్ర, కిరణ్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ మైదానంలో జరుగుతున్న షటిల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్‌లో లోకేష్, చైతన్య జట్టుపై అలి, రమేష్ జట్టు విజయం సాధించింది. విన్నర్‌కు రూ.10వేలు, రన్నర్‌కు రూ.5వేలు, మూడో బహుమతిగా రూ. 2 వేలు, నాల్గవ బహుమతి రూ. వెయ్యి నగదు బహుమతితోపాటు మెమెంటోలను అతిథుల చేతులమీదుగా క్రీడాకారులకు అందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్ కృష్ణప్రసాద్. అధ్యక్షులు మధు, కార్యదర్శి రాజా, సహాయ కార్యదర్శి నాగేంద్ర, సభ్యులు అఖిల్, లచ్చి, నారాయణస్వామి, ధను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు మెమొంటో అందిస్తున్న ముఖ్య అతిథులు, నిర్వాహకులు

అందుబాటులో ఆధార్ సేవలు

6వ వార్డు సచివాలయంలో ఆధార్ తీస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

కొత్తగా ఆధార్ కార్డు కావాలన్నా....కార్డుల్లో దొర్లిన తప్పొప్పులను సరి చేయించుకోవాలనుకున్నా....ఫొటో, సెల్ నంబరు, ఇతర వివరాలను మార్పించాలనుకున్నా... గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. అవసరాన్ని ఆసరా చేసుకుని కొందరు ఇష్టా రీతిన వ్యవహరించిన ఉదంతాలూ ఉన్నాయి. అనంతరం బ్యాంకులు, తపాలా కార్యాలయాల్లో వీటిని అందించారు. కేంద్రాలు స్వల్పంగా ఉండటం, ప్రజావసరాలు నానాటికీ పెరుగుతుండటంతో మళ్లీ ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒక దశలో సేవలు పొందడానికి కిలో మీటర్ల మేర దూరం తరలి వెళ్లి గంటల కొద్ది సమయం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆధార్ సేవలను సచివాలయ వ్యవస్థకు అనుసంధానం చేసింది. దీంతో ఇక నుంచి సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలోనే ఈ సేవలను పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది. హిందూపురం పురపాలక సంఘంలో 43 సచివాలయాలుండగా మూడు సచివాయాల్లో ఈ సేవలను ప్రారంభించారు. ఇందులో 37వ వార్డు సచివాలయంలో సాంకేతిక సమస్య, 14వ వార్డు సుగూరు సచివాలయంలో ఇన్‌ఛార్జి అడ్మిన్ కావడంతో రెండు కేంద్రాల్లో సేవలు తాత్కలికంగా నిలిచాయి. 6వ వార్డు ధర్మపురం సచివాలయంలో సేవలు అందుతున్నాయి. వాస్తవానికి మూడు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ లెక్కన హిందూపురం పురపాలక సంఘంలో 12 కేంద్రాలు రావాల్సుంది. పూర్తి స్థాయిలో ఆధార్ కేంద్రాలు వస్తే చేర్పులు, మార్పులు, నూతనంగా ఆధార్ తీసుకునే వారు బ్యాంకుల చుట్టు, పోస్టు ఆఫీసుల చుట్టు తిరగాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ పథకాల లబ్ధికి ఈకేవైసీ చేయించాల్సి రావడంతో ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు అనుసంధానం తప్పనిసరి చేశారు. కొత్తగా ఆధార్ కార్డు లేదా సవరణ చేసే సమయంలో వయస్సు ధ్రువీకరణ పత్రం, పంచాయతీ, పురపాలక శాఖ వారు జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రంతో పాటు, నివాస ధ్రువీకరణ అవసరం. ఆధార్ కేంద్రాల నిర్వహణకు సంబంధించి అన్ని పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఆధార్ అప్డేషన్ (డెమో గ్రాఫిక్)కు రూ.50, బయోమెట్రిక్ అప్డేషన్ రూ.100 రుసుం తీసుకుంటారు. కార్డు ప్రింట్‌కు రూ. 30 వసూలు చేయనున్నారు. కొత్తగా కార్డు తీసుకునే వారికి ఎలాంటి రుసుం ఉండదు.

సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

లారీ డ్రైవర్లు, క్లీనర్లకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి 60ఏళ్ల నిండిన తర్వాత పింఛను ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల భారీ వాహనడ్రైవర్స్, క్లీనర్స్ హక్కులసాధన సమితి వ్యవస్థాపకులు దుర్గారావు డిమాండ్ చేశారు. తెలుగురాష్ట్రాల భారీ వాహనడ్రైవర్స్, క్లీనర్స్ హక్కుల సాధన సమితి అధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎర్రగుంట నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి గొల్లపల్లి సమీపంలో తోటలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ డ్రైవర్లు పొరపాటుగా యాక్సిడెంట్ చేస్తే పరిస్థితిని గమనించకుండా నిందలు వేస్తుంటారని అలాంటి వాటికి అడ్డుకట్ట పడేవిధంగా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు, ఉద్యోగులకు, పరిశ్రమలకు ఇలా ప్రతివ్యవస్థ రవాణాలో డ్రైవర్ కీలకమని అలాంటి డ్రైవర్ల సంక్షేమానికి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ హక్కుల సాధనసమితి రాష్ట్ర కమిటీ ప్రధానకార్యదర్శి బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు రామ్మోహన్ రావు, చౌదరి, వెంకటరమణ, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రెసిడెంట్ వెంకటశివ, వైస్ ప్రెసిడెంట్ మసూద్ అలీ, జిల్లా ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, ధర్మవరం పట్టణ ప్రెసిడెంట్ ముసుగు హరికృష్ణతో పాటు అధికసంఖ్యలో డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

తమ గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

రొద్దం : పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక మండల కేంద్రంలోని టీచ్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ పాఠశాలలో 2010-2011 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా అప్పటి తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి తమ జ్ఞాపకాలు గుర్తుకు చేసుకుని సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజనరెడ్డి, తిమ్మారెడ్డి, విశ్వనాథ, తిమ్మారెడ్డి, విద్యార్థులు శషిధర్ రెడ్డి, నరేష్ ,తోటి విద్యార్థులు పాల్గొన్నారు.

సెమీఫైనల్స్ చేరిన సత్యసాయి జిల్లా జట్టు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

నంద్యాలలో జరుగుతున్న 13వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీలలో సత్యసాయి జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరినట్టు కోచ్ హస్సేన్ తెలిపారు సోమవారం ఉదయం జరిగిన లీగ్ మ్యాచ్లో ఏలూరు జట్టుపై 4-1 గోల్స్ తేడాతో సత్యసాయి జిల్లా జట్టు గెలిచింది. సెమీఫైనల్లో సత్యసాయి జిల్లా జట్టు, అనకాపల్లి జట్లు తలపడనున్నట్టు కోచ్ తెలిపారు. దీంతో హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ బంధనాథం సూర్యప్రకాశ్, సత్యసాయి జిల్లా అధ్యక్షులు బీవీ శ్రీనివాసులు, ధర్మాంబ హాకీ అసోషియేషన్ ప్రతినిధులు బండివేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, అంజన్న, గౌరిప్రసాద్ తదితరులు జట్టు సభ్యులను అభినందించారు.

సెమీ ఫైనల్‌కు చేరిన సత్యసాయి జిల్లా జట్టు

పార్వేటోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన ప్రజలు

శ్రీవారి పార్వేటోత్సవం

కదిరి అర్బన్ : ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కనుమ రోజు నిర్వహించు శ్రీవారి పార్వేటు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి శ్రీవారి పల్లకి సేవలో పాల్గొన్నారు. స్వామివారిని ఊరేగింపుగా తీసుకువచ్చి కదిరి కొండ కింద ప్రత్యేక పూజలు నిర్వహించి పార్వేటోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ సిఐ మధు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ, కార్యనిర్వాహణాధికారి పట్టెం గురుప్రసాద్, ప్రధాన అర్చకులు, సర్పంచి మణికంఠ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు వేణు, రవీంద్రారెడ్డి, గంగాధర, గోపాల్ రెడ్డి, రమేష్ నాయక్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

కొత్తచెరువు : మండల ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి మండల పరిధిలోని ఇండ్ల వెంకటం పల్లి లో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచి రత్నమ్మ, ఆలయ ధర్మకర్త అమెరికా చెన్నారెడ్డి, నాయకులు రెడ్డప్ప రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలో సంక్రాంతి పండుగను ఆనందోత్సహాల నడుమ గ్రామీణులు జరుపుకున్నారు. ప్రతి గ్రామంలో తెలుగువారి లోగిళ్లు కళకళలాడాయి. కళ్లాపు చల్లిన ముంగిళ్లలో రంగవల్లులపై గొబ్బెమ్మలు పెట్టి అందులో నవధాన్యాలు పోసి పూజలు చేశారు. అంతేకాక చిన్నారుల నుంచి పెద్దల వరకు గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేశారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం రోజున కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. రైతులు తమ ఇళ్లల్లోని గోవులను శుభ్రంగా కడిగి పసుపు, కుంకుమతో కొమ్ములను అలంకరించారు. అడపడుచులు తమ ఇంటి ముంగిట రంగవల్లులు వేసి రంగులను తీర్చిదిద్దారు. కొత్త బట్టలు దరించి, పిండి వంటకాలతో రుచులు చూశారు. దీంతో మూడు రోజులు పాటు పండుగ ఉత్సాహం మండలంలో కన్పించింది.

పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా జరిగాయి. మూడురోజులపాటు జరిగే సంక్రాంతి వేడుకల్లో భాగంగా ప్రతిరోజు రంగురంగుల ముగ్గులతో మహిళలు ఆనందంగా పండుగను జరుపుకున్నారు. ధర్మవరం పట్టణం పట్టుచీరలకు ప్రసిద్ధి కావడంతో కొంతమంది పట్టుచీరల డిజైన్లతో ఇంటి ముందు ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. ధర్మవరం పట్టణంలో డిజైనర్ నాగరాజు భార్య పట్టుచీర డిజైన్‌ను ఇంటి ముందు రంగులతో ముగ్గను వేసింది. అలాగే పట్టణంలోని మారుతీ నగర్ లో విజయలక్ష్మి అనే మహిళ రైతు కుటుంబం రంగులతో ముగ్గను వేసింది. వీటిని చూసేందుకు పట్టణంలోని మహిళలు ఆసక్తి చూపారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

జ్యోతుల ఉత్సవాలకు సర్వం సిద్ధం

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని పలు వార్డుల నుంచి శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతులు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు తలపై చౌడేశ్వరిదేవి జ్యోతులు పెట్టుకుని నృత్యం చేస్తూ అమ్మవారి పాటలు పాడుతూ దుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో అగ్నిగుండం ప్రవేశం చేసి జ్యోతుల ఉత్సవాలను ముగిస్తారు. ఇందుకోసం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోమవారం రాత్రి అగ్నిగుండంలో అగ్నిని వెలిగించి జ్యోతుల ఉత్సవాలను ప్రారంభించారు. కదిరిగేటు వద్ద నుంచి తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు తలపై అమ్మవారి కళాశాలను పెట్టుకుని పురవీధుల్లో ఊరేగించారు.

జ్యోతులు తీసుకెళుతున్న దృశ్యం

టిడిపిలో పలువురు చేరిక

మడకశిర : మండల పరిధిలోని ఆమిదాల గొంది పంచాయితీ హెచ్ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన పది కుటుంబాలు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మడకశిర నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. ఆ అభివృద్ధిని చూసి తాము టిడిపిలో చేరామని ఈర పెన్నప్ప, హనుమంతరాయప్ప తదితరులు తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల నాయకులు రంగేగౌడు, ఎల్ఐసి రామచంద్ర, సిద్ధారెడ్డి, మాజీ సర్పంచి నాగరాజు, లోకేష్, మంజు, శివ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో 'గుండుమల'